క్లుప్తంగా

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: సీపీఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రష్యా విప్లవ నాయకుడు లెనిన్ శత వర్ధంతి సభ స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా లెనిన్ చిత్ర పటానికి యూనియన్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్ కార్మిక వర్గం ముక్తికి మార్క్సిజం రచిస్తే.. దాన్ని ఆచరించి రష్యాలో కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించిన ఘనత లెనిన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి.సిహెచ్.వెంకటేశ్వర రావు, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘చదువంటే మాకిష్టం’



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ మేరకు గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించారు. అందులోని నీతిని బోధించారు.

జోరుగా కులగణన



68వ వార్డు చిన్న అక్కిరెడ్డిపాలెంలో వివరాలు సేకరిస్తున్న వలంటీర్లు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చిన్న అక్కిరెడ్డిపాలెం, పెద్ద అక్కిరెడ్డిపాలెం సచివాలయాల పరిధిలో గత మూడు రోజులుగా కుల గణన ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 28 వరకు జరుగుతుందని, ప్రజలంతా సర్వే ప్రక్రియకు సహకరించాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



మృతుని భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం నాయకులు

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ నాయకులు రాంబాబు, రమణ అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు స్వతంత్రనగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు సత్తిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో రామచంద్రనగర్, రిక్షా కాలనీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆదివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని భార్యకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు లక్ష్మీ, రాజారావు, అర్జున్‌రావు, త్రినాథరావు, త్రినాథ్, రామ్మూర్తి, చిన్నా, సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముని శోభాయాత్ర



శోభాయాత్రలో నాయకులు



సీతారామ లక్ష్మణ హనుమాన్ వేషధారులు

గాజువాక: అయోధ్య రామ మందిరంలో సోమవారం నిర్వహించనున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని గాజువాకలో ఆదివారం శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, ఆర్కే షోరూమ్ యజమాని దినేష్ మోదీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ యాత్రను కొత్త గాజువాకలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల 500 ఏళ్ల కల సాకారమైందన్నారు. అనంతరం కొత్త గాజువాక నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్, సినిమా హాల్ జంక్షన్ మీదుగా పాత గాజువాక వరకు శోభాయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కోలాటాల నడుమ తోడపెద్దులు, గుర్రాల రథాలపై శ్రీసీతారాములు, ఆంజనేయస్వామి వేషధారణతో భక్తులు యాత్రలో పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు దారి పొడవునా తీర్థ ప్రసాదాలు, అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు సోంబాబు, ఎల్లాజీరావు, రోహిణి, పద్మ, నాగేశ్వరరావు, జీలకర్ర రమణ, భువనేశ్వరి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ జెండా రెపరెపలు



జెండా పట్టుకుని పరుగు తీస్తున్న సక్సేనా

ఉక్కునగరం: అయోధ్యలో రామ మందిరం ప్రారంభ సమయం దగ్గర పడుతుండడంతో దేశ వ్యాప్తంగా ప్రజలు రామ జపంతో తరిస్తున్నారు. ప్రతి ఇంటా శ్రీరామ జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం డీజీఎం సంజయ్ సక్సేనా ఆదివారం కాషాయ వస్త్రాలు ధరించి ఉక్కునగరంలోని సెక్టార్లలో శ్రీరామ జెండా పట్టుకుని పరుగు పెట్టారు. దాదాపు అన్ని సెక్టార్ల మీదుగా సాగిన పరుగులో ఆయన జైశ్రీరామ్ నామ స్మరణ చేశారు. ఉక్కునగర వాసులు కూడా జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు.

ముస్తాబైన గ్రీన్‌సిటీ వెంకన్న ఆలయం



శోభాయమానంగా ముస్తాబైన గ్రీన్‌సిటీ వేంకటేశ్వరస్వామి ఆలయం

కూర్మన్నపాలెం: అయోధ్యలోని రామ మందిరంలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని కూర్మన్నపాలెం పరిధి గ్రీన్‌సిటీ శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం శోభయమానంగా ముస్తాబైంది. ఈ మేరకు సోమవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రామనామ భజనలతో అయోధ్య రామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించనున్నారు. సాయంత్రం 5 గంటలకు శోభయాత్ర పేరిట ఆలయ వీధుల్లో కలశాలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు రామనామ సంకీర్తనలు, రాత్రి 7 గంటలకు సాయినాథ కళాసమితికి చెందిన అరుణ్‌కుమార్ బృందం నృత్యరూపకం, రాత్రి 8 గంటలకు లేజర్ లైట్‌షో, అనంతరం బాణాసంచా వెలుగులు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలి
- ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి జగన్ సభ
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: భీమిలి నియోజకవర్గంలో ఈ నెల 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అన్ని వార్డుల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో స్థానిక బీసీ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని, వాటిని ఆయుధాలుగా చేసుకుని ప్రజల్లోకి వెళ్లి పార్టీని విజయపథంలో నడిపించేలా ముఖ్యమంత్రి బహిరంగ సభలో దిశానిర్దేశం చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త అంకితభావంతో సైనికుడిలా పనిచేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అంతా కలిసికట్టుగా పనిచేస్తే గాజువాక నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి మంచి మెజార్టీ తీసుకురావొచ్చని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారని, పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నందున ప్రజలను ఇంటికెళ్లి ఓటు అడిగే హక్కు మనకే ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) మాట్లాడుతూ ముఖ్యమంత్రి బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పార్టీ విజయానికి పని చేసి గాజువాక నియోజకవర్గం సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, బొడ్డు నరసింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు ధర్మాల శ్రీను, బొద్ద గోవింద్, క్లస్టర్ ఇన్‌చార్జులు కులుకూరి మంగరాజు, రామచంద్రరాజు, పూర్ణానందశర్మ, కార్పొరేషన్ల డైరెక్టర్లు యువశ్రీ, ప్రమీల, బోగాది సన్నీ, గుజ్జారి లలిత, నాయకులు పల్లా చినతల్లి, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి శ్రీనివాసరెడ్డి, సిరట్ల శ్రీను, దొడ్డి రమణ, ఇల్లపు ప్రసాద్, గుడివాడ లతీష్, సాపే బ్రహ్మయ్య, సంపంగి ఈశ్వరరావు, చిత్రాడ వెంకటరమణ, విమలా థామస్, మంత్రి మంజుల, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై కేంద్రం దిగిరాక తప్పదు



1074వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల చేస్తున్న పోరాట శక్తికి ఎదురుండదని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1074వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులతో పాటు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటించడం ప్రభుత్వ నిరంకుశత్వ పాలనకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా వ్యతిరేకిస్తున్నారని, ఇప్పటికైనా కేంద్రం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో కార్మికులంతా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులివ్వాలి

విశాఖ విద్య: ఆడుదాం ఆంధ్రా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల అప్పలరాజు కోరారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సెలవు రోజుల్లో పనిచేసిన కాలానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు.

ఘనంగా మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



మంత్రి అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేయర్ హరివెంకట కుమారి

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. 68వ వార్డు మిందిలో మంత్రి అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తల మధ్య అమర్ వేడుకలు జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, పార్టీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో మిందీ జంక్షన్ నుంచి పెద్ద ఊరేగింపుగా గ్రామంలోని రామాలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. నగర మేయర్ హరివెంకట కుమారి, నాయకులు చొక్కాకుల వెంకటరావు, కశింకోట జెట్పీటీసీ సభ్యుడు శ్రీధర్ రాజుతోపాటు పలువురు నాయకులు అమర్‌నాథ్‌కు పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అలవోకగా 150 పద్యాల ఆలాపన



డాక్టర్ పెదవీర్రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ అంకోశ హాల్‌లో తెలుగు పద్య సౌరభం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ ఈదర పెదవీర్రాజు ప్రముఖ కవులు రాసిన పద్యాలను అలవోకగా ఆలపించారు. 150 పద్యాలను ఏకధాటిగా చదవి కవులు, రచయితలను ఔరా అనిపించారు. గణనాథుడి పద్యంతో మొదలై 150 పద్యాలు చదవి వినిపించారు. సమకాలిన అంశాలను ఆధారంగా చేసుకొని ఆయన ఇంత వరకు పలు కవితలు రాశారు. తెలుగు భాష, పద్యాలపై తనకున్న పట్టుతో నన్నయ్య, తిక్కన, తిరుపతి వెంకట కవులు, దాశరథి తదితర కవుల నుంచి వచ్చిన పలు పద్యాలను, వాటి సారాంశాన్ని డాక్టర్ పెదవీర్రాజు చదవి వినిపించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో ఆయన వినిపించారు. డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, ముఖ్య అతిథి డాక్టర్ మీగడ రామలింగస్వామిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు




గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. అర్చకుడు రఘునాథ్, గిరి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాస రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని అధిష్టింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

ఉత్సాహంగా జైభీమ్ క్రికెట్ కప్ పోటీలు



జై భీమ్ వన్డే క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల దళిత సంఘాల నాయకులు రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం నిర్వహించిన జై భీమ్ వన్డే క్రికెట్ కప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జై భీమ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడాల ఈశ్వరరావు, కార్యదర్శి అనపర్తి సైదాసుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ముప్పిడి గిరి, దళిత నాయకులు రావాడ అప్పారావు, దుబాయ్ రవి, కొట్యాన రవి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉత్సాహంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని 14 దళిత సంఘాలు ఏకతాటిపైకి వచ్చి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీకి చెందిన షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం విన్నర్‌గా.. ఇదే వార్డు రామ్ రంజీ సంక్షేమ సంఘం జట్టు రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సభ్యులు తంతటి సంపత్, కాకర నరసింహరాజు, మర్రి సాయివికాస్, యమ్మల సురేష్ తదితరులు పాల్గొన్నారు.